పిదప రాజు ఇటులు అనెను - మీరు వెనుక చూడక నా వెనువెంట రండు.

వృద్ధభటుఁడు రాజు ననుగమించెను. మఱియొకఁడు నతని ననుగమించెను.

మిగిలినవా రందఱు ఒకరిమొగ మొకరు చూచికొనిరి. ఎవరి మొగముననను నెత్తురుచుక్క లేదు.

ఒకఁడు ముందరి భటునితో - నే నింటికిఁబోయి గునప మెత్తికొని వత్తు ననెను. మఱియొకఁడు - శూలము తెత్తుననెను. మరియొకఁడు కొడవలి తెత్తుననెను. ఇంకొకఁడు - సూది.

ఈమాట విని అందఱు నవ్విరి. రాజును, ముందర నున్న ఇరువురు భటులును వెనుదిరిగి చూడకయే చనుచుండిరి. వారికిని వీరికిని చాల వ్యవధాన ముండెను. క్రమక్రమముగా వారు వీరికి కానిపించుటయే లేదు.

వెనుకపడిన ఈ భటులలో ప్రధానుఁడు మిగిలినవారితో - ఓరీ మన మింటికిఁ బోయి భార్యాపిల్లలను తీసికొని పాఱిపోదమా లేక ఒంటరిగా పాఱిపోదమా? అని అడిగెను.

గుభుగుభుమని తుపాకి మోఁతలు వినబడెను. మఱి ప్రశ్నలేదు; సమాధానము లేదు, ఎవరి త్రోవ వారిదే. పాఱిపోవుటలో అసహాయ శూరులు! భూమిలో పూఁడిపోయినటులు వారొక్కరును కాన రాలేదు.

రాత్రి చాలసేపటికి దాఁక తుపాకులు మోఁగుచునే యుండెను. రాజు ఎంతసేపు వెనుదిరిగి చూచినను ఇరువురు తక్క మఱిభటులు లేరు. యుద్ధ మంతమాయెను. రాజుగారికే జయము కలిగెను.

**4**

నాఁడు నవమి, ప్రొద్దు గ్రుంకెను. అపుడు యామినీ పూర్ణతిలక పాట.

రాజబంధువు లొకచోట, ఉద్యోగులొకచోట, పండితులొకచోట, పామరు లొకచోట, నడుమరాజు. రాజుముందు యామినీ పూర్ణతిలిక.

తిలక పాడ నారంభించెను. సభ్యుల తలయూఁపు లారంభ మాయెను. బలేబలే నాదములు. హెచ్చరికలు.

తిలక కృతజ్ఞత తెలుప సభకు జేతు లెత్తెను.

సభ్యులకు మఱికొంచె ముత్సాహము. తల ఎంతయూఁ పిన నంత యభిజ్ఞత!

'తిలక పాడుచుండఁగా రాజోద్యానమున కోయిలు కోకోయని కూసినటులున్నవని రాజబంధు వొకఁడు ప్రక్క వానికి చెప్పెను. సభ్యుల ఆహానాదము భేరీనాదమువలె మిన్ను

